# నేటి ప్రస్థానం

తెలుగు దిన పత్రిక

APTEL/2013/54506

ఎడిటర్: ఐతగోని రాఘవేంద్ర | బుధవారం, 16 ఏప్రిల్ 2025 | సంపుటి: 12 | సంచిక: 34 | పేజీలు: 4 | వెల:10/-



## రిపోర్టర్స్ కావలెను

నిజాలు నిర్భయంగా రాసే సత్తా ఉండి.. ఎలాంటి భయం.. పక్షపాతం అన్నది లేకుండా ఉన్నది ఉన్నట్లు రాయగలిగే రిపోర్టర్లు కావలెను. మీలో ఈ సత్తా ఉంటే కింది నెంబర్లకు రెజ్యుమో పంపండి.

95150 34555

84979 20544




# మానవాళిపైకి మరో రోగం



మానవాళిని భయపెడుతున్న వాటిలో డయాబెటిస్ ఒకటి. ప్రపంచవ్యాప్తంగా 20 నుంచి 79 ఏళ్ల మధ్య ఉన్న వారిలో 53.7 కోట్ల మంది డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. అంటే ఆ వయసులోని మొత్తం జనాభాలో వీరు 10.5 శాతం. 2030 నాటికి ఈ సంఖ్య 64.3 కోట్లకు చేరుకుంటుందని అంచనా. అలాగే, 2045 నాటికి 78.3 కోట్లకు చేరుకుంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అంచనా వేస్తోంది. డయాబెటిస్ కేసులు ఎంతలా పెరుగుతున్నాయంటే ప్రపంచ జనాభా పెరుగుదలను ఇది మించిపోతోంది.

03


- అత్యంత ప్రమాదకారి టైప్-5 డయాబెటిస్
- దశాబ్దాల తర్వాత అధికారికంగా గుర్తింపు
- రోగ నిర్ధారణ తర్వాత ఏడాదిలోపే మరణం
- ఇప్పటి వరకు అంతుచిక్కని చికిత్స
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కేసులు
- ప్రపంచవ్యాప్తంగా 2.5 కోట్ల మంది బాధితులు
- చికిత్స విషయంలో వైద్యుల్లో గందరగోళం
- త్వరలోనే మరిన్ని పరిశోధనలు

# కాంగ్రెస్‌లో కాక!

- రోజురోజుకూ పెరుగుతున్న పదవుల లొల్లి
- ఒకరిని మించి ఒకరు గొంతు పెంచుతున్న ప్రజాప్రతినిధులు
- బహిరంగ వేదికలపై అసమ్మతి రాగం

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** కాంగ్రెస్‌లో పదవుల అసమ్మతి రాగం ఊపందుకుంది. ఒకరిని మించి మరొకరు ప్రజాప్రతినిధులు తమ గొంతు పెంచుతున్నారు. ఎలాగైనా మంత్రి పదవి సాధించేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు నానా యాగీ చేస్తున్నారు. ఒకరు ప్రజాప్రతినిధులను కూడగట్టి వారి మద్దతు పొందేందుకు ప్రయత్నాలు చేస్తుండగా ఇంకొందరు ఎన్నికల అప్పుడు అధిష్ఠానం తమకిచ్చిన

మిగతా 2 లో





# పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు

- మంత్రివర్గ విస్తరణ అధిష్ఠానం పరిధిలో ఉంది
- సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- హైదరాబాద్ వీడి గ్రామాలకు తరలి వెళ్లాల్సిందే
- సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండండి
- విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ సూచన

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ...ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ రెడ్డి సున్నితంగా హెచ్చరిక చేశారు. ఎవ్వరు కూడా పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దని అన్నారు. మంత్రివర్గ విస్తరణ అన్నది అదిష్టానం నిర్ణయమని కూడా స్పష్టం చేశారు. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనభాపక్ష సమావేశంలో సిఎం రేవంత్ మాట్లాడారు. తనకు మంత్రి పదవి రాకుండా జానా రెడ్డి అడ్డుకుంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రచ్చ చేస్తే.. పదేళ్లు పార్టీని

మిగతా 2 లో

# నోవాటెల్‌లో సీఎంకు తప్పిన ప్రమాదం

- హోటల్ లిఫ్ట్‌లో టెక్నికల్ సమస్య
- ఓవర్‌లోడ్‌తో కిందకు దిగిన లిఫ్ట్
- లిఫ్ట్‌లో సీఎం తదితరులతో ఓవర్‌లోడ్



02

# దుబాయ్‌లో హత్యకు గురైన ఇద్దరు

## కుటుంబాలకు బండి పరామర్శ.. మృతదేహాలను రప్పించేందుకు కృషి




**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** పాకిస్తానీ చేతిలో దుబాయిలో దారుణంగా హత్యకు గురైన ప్రేమ్ సాగర్ కుటుంబ సభ్యులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫోన్ చేసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. ప్రేమ్ సాగర్ తోపాటు హత్యకు గురైన నిజామాబాద్ కు చెందిన శ్రీనివాస్ మృత దేహాలను వీలైనంత తొందరగా స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతోపాటు మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు కేంద్ర మంత్రి ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే విదేశీ వ్యవహారాల మంత్రి కార్యాలయంతో మాట్లాడారు. వెంటనే దుబాయిలో హత్యకు గురైన ప్రేమ్ సాగర్, శ్రీనివాస్ మృత దేహాలను స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో విదేశాంగ శాఖ కార్యాలయ అధికారులు సైతం దుబాయి అధికారులతో మాట్లాడారు. వీలైనంత తొందరలో ఆయా మృత దేహాలను స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు ఎప్పటికప్పుడు విదేశాంగ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని హోంమంత్రిత్వ శాఖ అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వాన్ని కూలుస్తామంటే ఊరుకోం

## పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ హెచ్చరిక



**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోం అని.. ఇక్కడ ఎవరూ చేతులు కట్టుకుని కూర్చోలేదంటూ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు హెచ్చరించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎంత అవినీతి చేసిందో.. దోచుకుందో.. కాంట్రాక్టర్ల పేరుతో విధంగా లూటీ చేసిందో అనటానికి.. కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలే నిదర్శనం అంటూ దుమ్మెత్తిపోశారు. కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలపై మహేష్ కుమార్ గౌడ్ తోపాటు మంత్రులు, ఎమ్మెల్యే స్పందించారు. చోటామోటా కాంట్రాక్టర్లు కూల్చితే కూలే ప్రభుత్వం కాదని, ఎమ్మెల్యేల సంపూర్ణ మద్దతు తనకు ఉందని చెప్పారు. చోటామోటా బ్యాచ్‌కి భయపడమని, బీఆర్ఎస్ పదేండ్లు యథేచ్ఛగా దోచుకుందని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ కు అమ్ముడు, కొనుగోలుపై అనుభవం ఉందని, ఎమ్మెల్యేలు సంతలో పశువులు కాదని పీసీసీ చీఫ్ కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ నేతలకు కనీస గౌరవం లేదని, డబ్బులకు అమ్ముడు పోయే ఎమ్మెల్యేలని బీఆర్ఎస్ అంటోందని, ప్రభుత్వ పెద్దలతో చర్చించి కొత్త ప్రభాకర్ వ్యాఖ్యలపై తగిన నిర్ణయం తీసుకుంటామని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు.




# ఇందిరమ్మ లబ్ధిదారులకు శుభవార్త

## తొలివిడతలో 12 మందికి చెక్కుల పంపిణీ

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల కలను సాకారం చేసే దిశగా మరో అడుగు వేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించే కార్యక్రమంలో భాగంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం 12 మంది లబ్ధిదారులకు లాంఛనంగా ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రూ. 20.19 కోట్లను 2,019 మంది లబ్ధిదారులకు విడుదల చేశారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మొదటి విడతలో 70,122 ఇళ్లను మంజూరు చేసిన ప్రభుత్వం, ఇందులో బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి చేసుకున్న 2,019 మందికి ఈ నిధులను అందించింది. ఇప్పటివరకు 13,500 ఇళ్లు గ్రౌండింగ్ పక్రియను పూర్తి చేసుకున్నాయి. ఈ పథకం ద్వారా పేదలకు సొంత ఇల్లు అనే కలను సులభతరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని తెలిపారు. బేస్‌మెంట్, గోడలు లేదా శ్లాబ్ నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు అధికారుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. మీరే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే, డబ్బులు నేరుగా మీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ వినూత్న విధానం లబ్ధిదారులకు సమయం ఆదా చేయడమే కాక, నిధుల విడుదల పక్రియను వేగవంతం చేస్తుందని అంటున్నారు. ఇళ్ల నిర్మాణం విషయంలో కొన్ని మార్గదర్శకాలను కూడా మంత్రి వివరించారు. లబ్ధిదారులు కనీసం 400 చదరపు అడుగులు, గరిష్టంగా 600 చదరపు అడుగుల లోపు ఇంటిని నిర్మించుకోవాలి. ఇది లబ్ధిదారులకు సౌకర్యవంతమైన, సమర్థవంతమైన గృహాలను అందించడంలో సహాయపడుతుందని పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లక్షలాది కుటు-ంబాలకు సొంత ఇల్లు అనే కలను సాకారం చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కారు పనిచేస్తోంది. ఈ పథకం రాష్ట్రంలో గృహ నిర్మాణ రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తుందని, లబ్ధిదారుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అంతా ఆశిస్తున్నారు

# కాంగ్రెస్‌లో కాక!



మొదటి పేజీ తరువాయి

హామీలను గుర్తు చేస్తున్నారు. మరికొందరు ఒక అడుగు ముందుకేసి తమ ప్రయత్నాలను అడ్డుకుంటున్న ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నారు.

### ఒకరి తర్వాత ఒకరు..

ఎప్పుడైతే కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రివర్గ విస్తరణ చేయాలని ప్రయత్నాలు ప్రారంభించిందో అప్పటి నుంచి కాంగ్రెస్ నేతలు సైతం తమ ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. ప్రస్తుతం తెలంగాణ కేబినేట్‌లో ఆరు బెర్తులు ఖాళీగా ఉండగా ఆశావహులకు మాత్రం లెక్కేలేదు. కేబినేట్ సీటు మాకంటే మాకంటూ కుస్తీ పడుతున్నారు. ఉగాదికే వస్తుందనుకున్న జాబితా నేటికీ రాకపోవడంతో పదవుల పంచాయితీ తీవ్రమవుతున్నది. మొన్నటి మొన్న సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను కలిసినప్పుడు నూతన మంత్రుల ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఫిక్స్ అయిందనుకున్నారు. కానీ ఏం జరిగిందో ఏమోకానీ నేటికీ అతీగతీ లేదు.

### పెరుగుతున్న అసమ్మతి రాగాలు..

మంత్రి పదవులు ఆశిస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఓ వైపు తమ ప్రయత్నాలు కొనసాగిస్తూనే మరోవైపు అధిష్ఠానంపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. అంతేకాక తమకు పదవులు రాకుండా అడ్డుపడుతున్న ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నారు. ఈ జాబితాలో రంగారెడ్డి జిల్లాకు చెందిన మల్‌రెడ్డి రంగారెడ్డి ఉండగా .. ప్రస్తుతం కోమటిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత ప్రేం సాగర్‌రావు జత కలిశారు.

### ఒకరిద్దరితోనే ఈ సమస్య..

మంత్రి పదవి కోసం పోటీ పడుతున్న ప్రముఖుల్లో రంగారెడ్డి జిల్లాకు చెందిన మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి బ్రదర్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు. వీరిద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైనా వారి ప్రయత్నాలు భిన్నంగా ఉన్నాయి. సీనియర్ నేత మల్‌రెడ్డి రంగారెడ్డి ఎలాగైనా మంత్రి పదవి దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతోపాటు, కాంగ్రెస్‌లో హేమాహేమీ నేతలను కలిసి మద్దతు కూడగట్టారు. వారిచే తనకే మంత్రి పదవి ఇవ్వాలని అధిష్ఠానానికి చెప్పించుకోవడంతో పాటు లేఖలు సైతం రాయించారు. ఇక కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఓ అడుగు ముందుకేసి ఎన్నికలప్పుడు అధిష్ఠానం తనకిచ్చిన హామీని గుర్తు చేయడంతో పాటు.. భువనగిరి ఎంపీ సీటు గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని మరోసారి ఆఫర్ చేశారని వివరిస్తున్నారు. అంతేకాక తమ ప్రయత్నాలకు అడ్డుపడుతున్న వారిని బహిరంగ మీటింగ్‌లలో ఏకిపారేస్తున్నారు. ఒక కుటుంబంలో ఇద్దరికి మంత్రి పదవులుంటాయని కొందరు అంటున్నారని.. క్రికెట్ టీంలో ఇద్దరు అన్నదమ్ములు ఆడినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకో అని కాలు దువ్వుతున్నారు. మరీముఖ్యంగా సీనియర్ నేత జానారెడ్డిని టార్గెట్ చేశారు. 30 ఏండ్లు మంత్రిగా పని చేసిన జానారెడ్డి ఇప్పుడు మాత్రం రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల నేతలకు మంత్రి పదవులు ఇవ్వాలని చిలుకపలుకులు పలుకుతున్నారని.. నా పాలిట ధృతరాష్ట్రుడిగా మారాడని చౌటుప్పల్ జరిగిన ఓ సమావేశంలో బహిరంగంగా విమర్శలు గుప్పించారు.

> ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేత ప్రేం సాగర్ రావు సైతం విమర్శలు ఎక్కుపెట్టారు. కష్టకాలంలో పార్టీని కాపాడిన నాలాంటి వారిని కాదని అన్ని పార్టీలు తిరిగిన వచ్చిన నేతలకు మంత్రి పదవులు ఇస్తారా అని అధిష్ఠానాన్ని ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకట్‌స్వామి తన మంత్రి పదవికి అడ్డుపడుతున్నాడన్న అనుమానంతోనే ప్రేమ్‌సాగర్ ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

### సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నట్లు..

మంత్రి పదవులు మాకేనని రచ్చ రచ్చ చేస్తున్న ప్రజాప్రతినిధులపై సీఎం రేవంత్‌రెడ్డి మౌనంగా ఎందుకుంటున్నట్లు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఎన్నికల ప్రచారం అప్పుడు ఉమ్మడి వరంగల్ ఓ కాంగ్రెస్ కార్యకర్త చేసిన ఓవర్‌పై రేవంత్ రెడ్డి అక్కడికక్కడే ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలైనా.. ప్రజాప్రతినిధులైన సరే క్రమశిక్షణతో మెలగాల్సిందేనని హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పుడు ప్రజాప్రతినిధులు చేస్తున్న నానా యాగీపై మాత్రం మౌనం దాలుస్తున్నారు. కేబినేట్ విస్తరణ అంశాన్ని అధిష్ఠానానికి వదిలేసిన తాను.. తన కోటాలో కాంగ్రెస్ సీనియర్ నేత, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేరు సూచించినట్లు సమాచారం.

### ఇప్పట్లో చల్లారేనా?

మంత్రి పదవుల పంచాయతీ ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. ఒకరి తర్వాత ఒకరు తమ గళాన్ని విప్పుతూనే ఉన్నారు. మంత్రి పదవి ఇవ్వాల్సేందనని పట్టుబడుతున్నారు. ఇలా ప్రజాప్రతినిధుల విమర్శలు, ప్రతి విమర్శలు ఎటు దారి తీస్తాయో చూడాలి మరి. తెలంగాణ వచ్చిన తర్వాత మొదటి పదేండ్లు బీఆర్ఎస్‌లో అధికారంలో ఉండగా.. ఆ తర్వాత రాష్ట్రంలో జరిగిన పరిణామాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తన పదిహేను నెలల పాలనలో కొంత అసంతృప్తిని.. మరికొంత అసంతృప్తిని మూట గట్టుకుంది. ఇప్పటికే ఆర్థిక కష్టాలు చుట్టుముట్టగా ఇచ్చిన హామీలు ఎలా నెరవేర్చాలో తెలియక తలలు పట్టుకున్న ప్రభుత్వానికి ఇప్పుడు కొత్తగా మంత్రుల పదవులు చిక్కులు తెచ్చిపెడుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. కాంగ్రెస్‌లో మొదలైన ఈ పంచాయతీ ఇలానే కొనసాగి చివరాఖరికి బీఆర్ఎస్ గ్రాఫ్ పెరిగేలా చేస్తుందోమో ఆలోచించుకోవాలి. ఈ ఇంటి పంచాయతీ చివరికి వీధిలోకి వస్తే కాంగ్రెస్ కథ కంచికి చేరినట్టేనా!



# పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు

మొదటి పేజీ తరువాయి



కాపాడుకున్న మమ్మల్ని కాదని.. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు ఇస్తారా అని ప్రేమ్‌సాగర్ రావు పరోక్షంగా ప్రభుత్వానికే వార్నింగ్ ఇచ్చారు. ఇలా ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంపై సీఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు హెచ్చరికలు చేశారు. మంత్రి పదవులను అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానందే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని అన్నారు. మీరు మాట్లాడేదంతా రికార్డవుతుందని హెచ్చరించారు.అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ సోషల్‌మీడియా వాడటం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వంపై నెగిటివ్ ప్రచారం చేస్తుంటే.. ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని అన్నారు. వీకెండ్ రాజకీయాలు చేయొద్దని సూచించారు. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్షం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. పలువురు ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు తెలుస్తోంది. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని సీఎం తేల్చి చెప్పారు. మంత్రి పదవులపై ఒకరికి మించి మరొకరు లీకులు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేసిన సీఎం.. ఇష్టం వచ్చినట్లు- మాట్లాడితే మంత్రి పదవులు రావన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు జాగ్రత్తగా పని చేసుకోవాలని సూచించారు. కాగా, మంత్రి వర్గ విస్తరణపై కొందరు ఆశావహులు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఏకంగా హుకుం జారీ చేశారు. మరోవైపు.. మంత్రి పదవి విషయంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇలా మంత్రి వర్గ విస్తరణపై ఆశవహులు బహిరంగంగ మాట్లాతుండటంతోనే తాజాగా జరిగిన సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశర చేశారు. ఎమ్మెల్యేలు ప్రతి గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతా. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి.. బుల్డోజర్లు పంపిస్తున్నారని ప్రధాని మాట్లాడుతున్నారు. భాజపా, భారాస కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెలంగాణ మోడల్‌పై దేశంలో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే భాజపా, భారాస ఒక్కటయ్యాయి. సన్నబియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్. భాజపా పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క,పొంగులేటి, శ్రీధర్ బాబు, పొన్నం, పిసిస చీఫ్ మహేశ్కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మే15 నుంచి26 వరకు సరస్వతీ పుష్కరాలు

## కాళేశ్వరంలో పుష్కర ఏర్పాట్లు...మొబైల్ యాప్ ప్రారంభం



**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు జరగనున్నాయి. పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్, మొబైల్ యాప్, పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. పుష్కరాల వేళ భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పుష్కరాలకు నిత్యం 50 వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. కాళేశ్వరంలో 17 అడుగుల ఏకశిల రాతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు- తెలిపారు. భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో టెంట్ సిటీ- నిర్మించనున్నట్లు చెప్పారు. పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ. 35 కోట్లు- కేటాయించిందని మంత్రులు పేర్కొన్నారు. తెలంగాణ సహా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు వస్తారని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# నోవాటెల్‌లో సీఎంకు తప్పిన ప్రమాదం

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నోవాటెల్ హోటల్‌లో రేవంత్ రెడ్డి ఎక్కిన లిఫ్ట్ ఓవర్‌లోడ్ కారణంగా సాంకేతకి సమస్య ఏర్పడింది. ఓవర్ వెయిట్‌తో ఉండాల్సిన ఎత్తు కంటే లిఫ్ట్ లోపలికి దిగిపోయింది. సీఎం ఎక్కిన లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో లిఫ్ట్ మొరాయించింది. ఓవర్ వెయిట్ కారణంగా ఉండాల్సిన ఎత్తు కంటే లోపలికి దిగిపోయింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు, సెక్యూరిటీ- సిబ్బంది లిఫ్ట్‌ను ఓపెన్ చేసి వేరే లిఫ్ట్‌లో సీఎంను కిందకు పంపించారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి సహా అధికారులు, సిబ్బంది ఆందోళన చెందారు. ఏం జరుగుతుందో అర్థంకాక కాసేపు అయోమయానికి గురయ్యారు. అనంతరం పెద్ద ప్రమాదం ఏమీ లేదని తెలుసుకుని లిఫ్ట్ నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం మరో లిఫ్ట్‌లో ముఖ్యమంత్రిని అధికారులు తరలించారు. సీఎల్పీ సమావేశం సందర్భం హోటల్ వద్దకు సీఎం రేవంత్ రెడ్డి చేరుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ విప్‌లు, కొంతమంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి ఆహ్వానం పలికి హోటల్ లోపలికి తీసుకెళ్లారు. అయితే పైఅంతస్తుకు వెళ్లే క్రమంలో 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో రేవంత్ రెడ్డితోపాటు 13 మంది ఎక్కారు. దీంతో లిఫ్ట్ ఉండాల్సిన స్థానం కంటే కిందికి కుంగిపోయింది. వెంటనే అలారం మోగడంతో అధికారులు, హోటల్ సిబ్బంది అప్రమత్తం అయ్యారు. హుటాహుటిన లిఫ్ట్ వద్దకు పరుగులు పెట్టారు. అనంతరం సీఎం సహా అందరినీ లిఫ్ట్ నుంచి బయటకు తీసుకువచ్చారు. అనంతరం మరో లిఫ్ట్‌లో సమావేశం జరుగుతున్న సెకండ్ ఫ్లోర్‌కు తీసుకెళ్లారు. రేవంత్ రెడ్డి ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో ఎమ్మెల్యేలు, అధికారులు, హోటల్ సిబ్బంది అంతా ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి త్రుటిలో ప్రమాదం తప్పింది.


# మానవాళిపైకి మరో రోగం





- అత్యంత ప్రమాదకారి టైప్-5 డయాబెటిస్
- దశాబ్దాల తర్వాత అధికారికంగా గుర్తింపు
- రోగ నిర్ధారణ తర్వాత ఏడాదిలోపే మరణం
- ఇప్పటి వరకు అంతుచిక్కని చికిత్స
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కేసులు
- ప్రపంచవ్యాప్తంగా 2.5 కోట్ల మంది బాధితులు
- చికిత్స విషయంలో వైద్యుల్లో గందరగోళం
- త్వరలోనే మరిన్ని పరిశోధనలు

మధుమేహంలో సాధారణంగా మూడు రకాలున్నాయి. టైప్-1, టైప్-2తోపాటు గర్భధారణ మధుమేహం. ఇప్పుడు ఈ జాబితాలో టైప్-5 మధుమేహం చేరింది. ఇది పోషకాహార లోపంతో సంభవిస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో బరువు తక్కువగా ఉండే, తినడానికి తిండిలేని, పోషకాహార లేమితో బాధపడే యువతలో కనిపించే ఈ ప్రత్యేక రకం మధుమేహాన్ని టైప్-5గా డయాబెటిస్‌గా పిలుస్తున్నారు. ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ (ఐడీఎఫ్) చేసిన తాజా పరిశోధన ద్వారా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌లో మెడిసిన్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మెరెడిత్ హాకిన్స్ చేసిన పరిశోధన కారణంగా ఈ డయాబెటిస్ గుర్తింపునకు నోచుకుంది. డాక్టర్ మెరెడిత్ గ్లోబల్ డయాబెటిస్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపక డైరెక్టర్‌గానూ వ్యవహరిస్తున్నారు.




మానవాళిని భయపెడుతున్న వాటిలో డయాబెటిస్ ఒకటి. ప్రపంచవ్యాప్తంగా 20 నుంచి 79 ఏళ్ల మధ్య ఉన్న వారిలో 53.7 కోట్ల మంది డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. అంటే ఆ వయసులోని మొత్తం జనాభాలో వీరు 10.5 శాతం. 2030 నాటికి ఈ సంఖ్య 64.3 కోట్లకు చేరుకుంటుందని అంచనా. అలాగే, 2045 నాటికి 78.3 కోట్లకు చేరుకుంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అంచనా వేస్తోంది. డయాబెటిస్ కేసులు ఎంతలా పెరుగుతున్నాయంటే ప్రపంచ జనాభా పెరుగుదలను ఇది మించిపోతోంది. ప్రపంచ జనాభా 20 శాతం పెరుగుతుండగా, డయాబెటిస్ కేసుల పెరుగుదల 46 శాతం ఉందని నిపుణులు చెబుతున్నారు. మధుమేహం కేసుల పెరుగుదల ఇలా ఉంటే ఇప్పుడు మరో సరికొత్త డయాబెటిస్‌ను అధికారికంగా గుర్తించారు. అదే టైప్-5 డయాబెటిస్. అత్యంత ప్రమాదకమైన ఈ మధుమేహాన్ని కొన్ని దశాబ్దాల తర్వాత అధికారికంగా గుర్తించారు.

పౌష్టికాహార లోపంతో వచ్చే మధుమేహం అనేది చరిత్రలో చాలా వరకు గుర్తింపునకు నోచుకోలేదని, సరైన అవగాహన లేని వ్యాధి అని డాక్టర్ హాకిన్స్ తెలిపారు. దీనిని టైప్-5 దయాబెటిస్‌గా గుర్తించడం అనేది ఎంతో మంది జీవితాలను ప్రభావిత చేసే ఆరోగ్య సమస్యపై అవగాహన పెంచే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని హాకిన్స్ అభిప్రాయపడ్డారు.




నిజానికి పౌష్టికాహార లోపంతో వచ్చే మధు మేహాన్ని తొలిసారి 70 ఏళ్ల క్రితమే గుర్తించా రు. ఆ తర్వాత నిర్వహించిన పలు అధ్యయనా లు దీనిని పేద దేశాలలో ఎక్కువగా కనిపించే వ్యాధిగా పేర్కొన్నాయి. ఆ నివేదికలకు స్పందన గా 1985లో ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని ప్రత్యేక మధుమేహ రకంగా గుర్తించింది. అయి తే, తగిన ఫాలో అప్ స్టడీస్, తగిన ఆధారాలు లేకపోవడంతో 1999లో డబ్ల్యూహెచ్‌వో ఆ గుర్తింపును రద్దుచేసింది.

అధిక బరువు కారణంగా వచ్చే మధుమేహాన్ని అంటే టైప్ 2 దయాబెటిస్ అంటారు. అభివృద్ధి చెందిన దేశాల్లోని యువతలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. కానీ, ఇప్పుడు గుర్తించిన టైప్-5 దయాబెటిస్ ఎక్కువ తినడం వల్ల కాకుండా తినకపోవడం వల్ల వస్తుంది. ఎక్కువగా యువతే దీని బారినపడే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా 2 నుంచి రెండున్నర కోట్ల మందికిపైగా ఈ వ్యాధి సోకినట్టు అంచనా. ఆసియా, ఆఫ్రికా ఖండాలలో కనిపిస్తోంది. అయితే, ఈ రోగులకు ఎలాంటి చికిత్స అందించాలన్న విషయంలో వైద్యులకు ఇప్పటి వరకు స్పష్టత లేదు. పలు సందర్భాలలో వ్యాధి నిర్ధారణ అయిన ఏడాదిలోపే మరణిస్తున్నట్టు డాక్టర్ హాకిన్స్ తెలిపారు.



నిజానికి టైప్-5 దయాబెటిస్ బారినపడిన వారు బక్క పలుచగా ఉంటారు కాబట్టి దానిని టైప్-1 దయాబెటిస్‌గా వైద్యులు పొరబడేవారు. టైప్-1 దయాబెటిస్‌కు ఇన్సులిన్ అవసరం. అయితే, వారికి ఇన్సులిన్ పనికిరాకపోవడమే కాకుండా కొన్ని సందర్భాలలో ప్రాణాంతకమైన 'లో బ్లడ్ షుగర్'ను కలిగించేది. అలాగే, వారికి టైప్-2 దయాబెటిస్ లక్షణాలు కూడా లేకపోవడంతో వైద్యులు కొంత గందరగోళానికి గురయ్యేవారు. ఈ వ్యాధి చాలామందిని అంధులను చేస్తూ మరణానికి కారణం అవుతోంది. ఇప్పుడు దీనిని అధికారికంగా గుర్తించడం వల్ల ఇకపై ఈ వ్యాధికి సరైన పరిష్కార మార్గాలు కనిపెట్టే అవకాశం ఉందని డాక్టర్ హాకిన్స్ అభిప్రాయపడ్డారు.





డాక్టర్ హాకిన్స్ 2010లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ గ్లోబల్ దయాబెటిక్ ఇనిస్టిట్యూట్‌ను స్థాపించారు. ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఈ రోగానికి కారణమైన మెటబాలిక్ లోపాలను వెలికితీసే ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ పరిశోధనలు ఈ వ్యాధికి సమర్థవంతమైన చికిత్స మార్గాలను కనుగొనడంలో కీలకంగా మారాయి.

2022లో డాక్టర్ హాకిన్స్, ఆమె సహచరులు భారతదేశంలోని వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజ్‌లో చేసిన అధ్యయనంలో ఈ వ్యాధి టైప్-1, టైప్-2 దయాబెటిస్‌లకు పూర్తిగా భిన్నమైనదనే విషయాన్ని నిరూపించారు. గత అధ్యయనాల్లో ఇది ఇన్సులిన్ రెసిస్టెన్స్ వల్ల వస్తుందని భావించారు. "కానీ, ఈ రోగుల్లో ఇన్సులిన్ ఉత్పత్తి సామర్థ్యంలో తీవ్రమైన లోపం ఉంది. దీనిని ఇంతకుముందు గుర్తించలేదు. ఈ విషయం తెలిసిన తరువాతే ఈ వ్యాధిని ఎలా అర్థం చేసుకోవాలో, ఎలా చికిత్స చేయాలో అర్థమైంది" అని డాక్టర్ హాకిన్స్ వివరించారు. క్రిస్టియన్ మెడికల్ కాలేజ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సమావేశంలో ఈ వ్యాధి తత్వం, నిర్ధారణ, చికిత్స పద్ధతులు గురించి చర్చించారు. దీనిపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించారు. పలు దేశాల పరిశోధకులు తమ అధ్యయన ఫలితాలను ఐడీఎఫ్, అమెరికన్ దయాబెటిస్ అసోసియేషన్ నిపుణుల ముందుంచారు. సమావేశంలో పాల్గొన్న వారందరూ ఒక మాట మీద ఈ వ్యాధిని ప్రత్యేక మధుమేహ రకంగా అంటే టైప్-5 గుర్తించాలని ఓటు వేశారు. ఆ నిర్ణయాన్ని ఐడీఎఫ్ వరల్డ్ దయాబెటిస్ కాంగ్రెస్ 2025 (బ్యాంకాక్)లో అధికారికంగా ప్రకటించారు. ఈ గ్రూప్ వచ్చే రెండు సంవత్సరాల్లో టైప్-5 దయాబెటిస్‌కు సంబంధించి తగిన నిర్ధారణ, చికిత్స మార్గదర్శకాలు రూపొందించనుంది.

పౌష్టికాహార లోపం వల్ల వచ్చే మధుమేహం అనేది ట్యూబర్క్యులోసిస్ (టీబీ) కంటే సాధారంగా ఉంటుంది. హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో సమాన స్థాయిలో వ్యాప్తి చెందింది. అయితే, దీనికి స్పష్టమైన పేరు లేకపోవడం వల్ల గుర్తించడం, చికిత్స చేయడం కష్టంగా మారింది. ఇప్పుడిది టైప్-5 దయాబెటిస్‌గా అధికారికంగా గుర్తింపు పొందడంతో దీనిపై మరిన్ని పరిశోధనలు జరిగే అవకాశం ఉంది. అలాగే సమర్థవంతమైన చికిత్సలు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు.

# మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ బ్యూటిఫుల్ సీజన్ 2 పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** హైదరాబాద్ వేదికగా ఇటీవలే నిర్వహించిన మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటీఫుల్ ఈవెంట్ విజయవంతం కావడంతో సక్సెస్ మీట్ నిర్వహించారు. దీనిలో భాగంగా మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటీఫుల్ సీజన్ 2ను ప్రకటించారు. రెండో సీజన్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఫౌండర్ కిరణ్మయి అలివేలు, సీజన్ -1 విజేతలతో కలిసి ఆవిష్కరించారు. ఔత్సాహిత యువతులకు ఇది మంచి వేదికని కిరణ్మయి చెప్పారు. నిత్య జీవితంలోని ఆలోచనలు, ఆశయాలకు పెళ్లి ముగింపు కాదనీ, మరో అద్భుత ఆరంభమన్నారు. మగువ సౌందర్యాన్ని మరింత గ్రాండ్‌గా ప్రదర్శించడానికి ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో పలు ఫ్యాషన్ షోలు, బ్యూటీ కాంటెస్ట్‌ల్లో పాల్గొన్న అనుభవంతో, ఔత్సాహికులకు అవకాశాన్ని కల్పించాలనే లక్ష్యంతో ఈ వేదికను ఏర్పాటు చేశామన్నారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలను ఫ్యాషన్ వేదికపై ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. అలాగే క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు సామాజిక బాధ్యతతో కొన్ని సేవా కార్యక్రమాలు




కూడా నిర్వహిస్తున్నట్టు మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటీఫుల్ ఫౌండర్ కిరణ్మయి అలివేలు చెప్పారు. సీజన్ 2 ప్రకటన సందర్భంగా మొదటి సీజన్ లో విజేతలుగా నిలిచిన వారంతా ర్యాంప్ వ్యాక్ తో అలరించారు.

# ఘనంగా శ్రీ వెంకట మరకత చంద్రమౌళీశ్వర దేవాలయం ప్రథమ వార్షికోత్సవం

## స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ, ఎమ్మెల్యే



**నాగారం, ఏప్రిల్ 15 (నేటి ప్రస్థానం):** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శిల్ప నగర్ లో శ్రీ వెంకట మరకత చంద్రమౌళీశ్వర హనుమాన్ దేవాలయం ప్రథమ వార్షికోత్సవం మంగళవారం కన్నుల పండుగగా జరిగింది. ఈ వార్షికోత్సవ శుభ కార్యానికి మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి,మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ గూడూరు ఆంజనేయులుగౌడ్, జనరల్ సెక్రెటరీ కౌకుట్ల అనంత రెడ్డి నాయకులకు శాలువాతో ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్ గౌడ్,గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్, నాయకులు మోకు జగన్మోహన్ రెడ్డి,కొమిరెల్లి సుధాకర్ రెడ్డి, అన్నంరాజు శ్రీనివాస్, తెల్లశ్రీధర్,గండి అంజయ్య గౌడ్,మాజీ వార్డు సభ్యులు సాయినాథ్ గౌడ్,గుండు మధుగౌడ్,యువ నాయకులు కౌకుంట్ల రాహుల్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్,జూపల్లి నరేష్,మర్రి మోహన్ రెడ్డి,కౌకుట్ల శ్రీకాంత్ రెడ్డి,వామన్, తదితరులు నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బహుళ ప్రయోజనకారి కోనాకార్పస్

- ఈ వృక్షంపై వస్తున్న అపోహలను వీడాలి
- మీడియా సమావేశంలో వక్తలు

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** కోనాకార్పస్ బహు ప్రయోజనకారి అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మంగళవారం జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. మోహన్‌రావు మాట్లాడుతూ ప్రకృతిలో ఉన్న ఏ వృక్షం, జీవజాలం చెడును చేయవన్నారు. కోనోకార్పస్ వృక్షాల వేర్లు విస్తరించి పైపులైన్లు, గోడలు దెబ్బతీస్తాయని, విషవాయులను విడుదల చేస్తాయన్నది అపోహ మాత్రమేనన్నారు. కోనోకార్పస్ వృక్షాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నట్లు పరిశోధన పత్రాలు పేర్కొంటున్నాయన్నారు. జంతువులకు మేలు చేస్తాయని.. హైవేలపై విషపూరితమైన వాయు కాలుష్యాన్ని తగ్గిస్తాయని తెలిపారు. ఈ చెట్ల ద్వారా సమకూరే నూనె సైతం ఔషధపరంగా కూడా ఎంతో ప్రయోజనకారిగా ఉంటుందని.. యాంటి ఆక్సిడెంట్‌గా




పని చేయడంతో పాటు మధుమేహం, వివిధ రకాల ఇన్‌ఫెక్షను తగ్గిస్తుందన్నారు. జన చైతన్య వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ కోనాకార్పస్ చెట్లు అత్యధికంగా కార్బన్ డయాక్సాయిడ్‌ను పీల్చుకొని ఆక్సిజన్‌ను సైతం అధికంగా విడుదల చేస్తుందని పరిశోధనల్లో తేలిందన్నారు. యోగి వేమన యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఏ ఆర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో వాతావరణంలో మార్పులు, వృక్షాల వల్ల మానవాళికి ఉపయోగాలు తదితర అంశాలను వివరించారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో ప్రొఫెసర్ బీఎన్ రెడ్డి, విశ్రాంత అధ్యాపకులు గోపాలకృష్ణ, వీఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

# వడ్డీలేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి




## స్త్రీ సమ్మిట్ కార్యక్రమంలో భట్టి విక్రమార్క

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** వడ్డీలేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశం లభించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు ఫ్రీ రుణాలు ఇస్తున్నామని చెప్పారు. స్వయం సహాయక గ్రూపులకు రూ.20 వేల కోట్లకు పైగా లోన్లు ఇస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ తాజ్ దక్కన్ హోటల్ లో నిర్వహించిన స్త్రీ సమ్మిట్ 2.0 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు భట్టీ. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ-కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించి డిప్యూటీ సీఎం.. మహిళా సాధికారత కోసమే స్త్రీ సమ్మిట్ నిర్వహిస్తున్నామని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఈ సందర్భంగా డిప్యూటీ-సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఒకవైపు స్త్రీలను దేవతలుగా చూస్తేనే మరోవైపు కంట్రోల్ చేయాలనే ప్రయత్నం తరతరాలుగా జరుగుతూనే ఉందని అన్నారు. హిందూ కోడ్ బిల్లుతోనే మహిళా సాధికారత ప్రారంభం అయ్యిందని, అంబేద్కర్ వల్లే మహిళలకు హక్కులు లభించాయని గుర్తు చేశారు. మహిళలకు వారతసత్వ హక్కులు లభించాయని తెలిపారు. తెలంగాణలో మహిళలకు ఫ్రీ బస్ స్కీం సక్సెస్ ఫుల్ గా నడుస్తోందని అన్నారు డిప్యూటీ- సీఎం. సోలార్ ఎ÷-లాంట్ నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించామని, దీంతో సోలర్ ఎ÷-లాంట్ నిర్వహణలో మహిళలకు భాగస్వామ్యం లభించిందని అన్నారు. ఇలాంటి స్త్రీ సమ్మిట్ లతో మహిళా సాధికారత సాధించవచ్చుని పిలుపునిచ్చారు.

# పంటలు పరిశీలించి.. రైతులకు ధైర్యం చెప్పి

## నకిరేకల్ మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే వేముల వీరేశం

**నకిరేకల్, నేటి ప్రస్థానం:** అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం నకిరేకల్ మండలం పాలెం, టేకులగూడెం, వల్లభాపురం గ్రామాల్లో వీచిన ఈదురు గాలులు, అకాల వర్షానికి నష్టపోయిన పంటలు, నిమ్మ తోటలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ అకాల వర్షంతో చేతికొచ్చిన పంటలు నేలకొరగగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కొన్ని గ్రామాల్లో భారీగా వీచిన గాలులకు కరెంట్ స్తంభాలు నేల కొరగడంతో పాటు ఇంటి పై కప్పులు లేచిపోయాయని అన్నారు. వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. నిమ్మ తోటల రైతులకు కొత్త మొక్కలు నాటుకునేందుకు సబ్సిడీ అందజేస్తామన్నారు.

# ఇంగ్లీష్ మేడమ్ మమ్మల్ని టార్చర్ చేస్తుంది..

## కస్తూర్బాగాంధీ విద్యార్థుల ధర్నా

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** ఇంగ్లీష్ మేడం మమ్మల్ని టార్చర్ చేస్తుంది. బాత్రూంకు వెళ్లినప్పుడు ఫొటోలు తీసి ఎవరికో పంపుతుంది. చదవకపోతే గొంతు పట్టి గాల్లోకి లేపుతోందిలి అని నాగర్‌కర్నూల్ జిల్లా నాగనూలు కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. తరగతులు బహిష్కరించి మూడు గంటల పాటు ఎండలో కూర్చొని ధర్నా చేస్తూ ఇంగ్లీష్ టీచర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పదిరోజులు క్రితం ఆంగ్ల ఉపాధ్యాయురాలు వేధింపులు భరించలేక 9వ తరగతి విద్యార్థి యామిని ఆత్మహత్యాయత్నం చేసినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా కల్యాణి టీచర్‌ను సస్పెండ్ చేయాలని.. లేకపోతే తాము ఎట్టి పరిస్థితుల్లో తరగతులకు వెళ్లబోమని విద్యార్థులు ఘటాపథంగా చెబుతున్నారు.

# నగేష్ ప్రధమ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన ముప్పు శ్రీనివాస్ రెడ్డి.




**నాగారం,ఏప్రిల్ 15(నేటి ప్రస్థానం):** నాగారం మున్సిపల్ ఓల్డ్ విలేజ్ కి చెందిన దాసోహం నగేష్ ప్రధమ వర్ధంతి కార్యక్రమంని అతని సహోదరుడు దాసోహం నర్సింగ్ రావు(చిన్న) మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి హాజరై దాసోహం నరేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసోహం నర్సింగ్,మాజీ వార్డు సభ్యులు కిల్లారి శ్రీనివాస్ యాదవ్,సాయినాథ్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి రామిరెడ్డి,సతీష్, మనోహర్ పాల్గొన్నారు.

# ‘సీసీ’ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



హయత్ నగర్, ఏప్రిల్ 15: హయత్‌నగర్ డివిజన్ పరిధిలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం డివిజన్‌లోని మహా గాయత్రి నగర్‌లో జరుగుతున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతాప్రమాణాలు పాటించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్, ఏఈ హేము నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్ , గాయత్రి కాలనీ అధ్యక్షుడు దేవ్ సింగ్, ప్రధాన కార్యదర్శి మాలిగా లింగం, సంక్షేమ సంఘం సభ్యుడు భగవత్ గౌడ్, కాలనీవాసులు శ్రీనివాస్ యాదవ్, బలరాం రెడ్డి, నవీన్, వేణుగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.